క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

యాలాల: మండల మహిళా సమాఖ్య సాధారణ సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం ప్రమీళ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాఖ్య భవనంలో ఉదయం 11 గంటలకు సమీక్ష ఉంటుందని, ముఖ్య అతిథిగా ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా హాజరుకానున్నట్లు వెల్లడించారు.

తల్లిపాలు అమృతం

అనంతగిరి: తల్లిపాలు అమృతంతో సమానమని వికారాబాద్ ఎంపీపీ చంద్రకళ అన్నారు. మంగళవారం వికారాబాద్ మండలం నారాయణపూర్ గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని, వాటిలో వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటేశ్వరమ్మ, సూపర్‌వైజర్లు సుశీల, నరసమ్మ, కళావతి, శాంత అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పూడూరు: సస్యరక్షణ చర్యలు చేపట్టి పత్తి, మొక్కజొన్న పంటలను కాపాడుకోవాలని రైతులకు వ్యవసాయ ఏడీఏ లక్ష్మీకుమారి సూచించారు. మంగళవారం చన్గోముల్‌లో పత్తి పంటను పరిశీలించి మాట్లాడారు. పెను బంక నివారణకు అధికారుల సూచనల మేరకు నీమ్‌ఆయిల్‌ను పిచికారీ చేయాలని చెప్పారు. వర్షాలు అధికంగా కురిసిన వలన పంటలు తెగుళ్ల బారిన పడకుండా వ్యవసాయ అధికారులను సంప్రదించి పంటలను కాపాడాకోవాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. గ్రామంలో ఇటీవల మృతి చెందిన శంకరయ్య ఇంటికి వెళ్లి వివరాలను సేకరించారు. వీలైనంత త్వరగా రైతుబీమా వచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ ఇలియాస్, అగ్రోస్ డీలర్ సుజిత్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

బంట్వారం: పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉంటే సత్వరమే చర్యలు చేపడతామని కోట్‌పల్లి తహసీల్దార్ ఆశాజ్యోతి అన్నారు. మంగళవారం ఆమె బార్వాద్, జిన్నారం, నాగసాన్‌పల్లి, కరీంపూర్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి సమస్యలు తెలుసుకొని మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా సర్వం సిద్ధం చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్వాద్, కరీంపూర్ సర్పంచ్‌లు వెంకటేశ్ యాదవ్, సుందరి అనిల్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అనంతగిరి: వికారాబాద్ మండలం మైలార్ దేవరంపల్లి గ్రామాన్ని మంగళవారం ఉదయం ఎంపీడీఓ సత్తయ్య సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎవెన్యూ ప్లాంటేషన్, పిచ్చి మొక్కల తొలగింపు, పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో ఎలాంటి పిచ్చి మొక్కలు లేకుండా చూడాలన్నారు. మొక్కలు విరివిగా నాటి, వాటిని సంరక్షించాలని సూచించారు. చెట్లకు పాదులు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, సర్పంచ్ తిరుపతిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం

బషీరాబాద్: పల్లెల్లో పారుశుద్ధ్యం లోపించి కాలనీలు కంపుకొడుతున్నాయని ఆర్‌ఎంపీల సంఘం మండల అధ్యక్షుడు జయరామ్‌చారీ ఎంపీడీఓ రమేష్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. పారుశుద్ధ్య కార్మికుల సమ్మెవలన గ్రామాల్లో చెత్తపేరుకుపోయి దోమల బెడద ఎక్కువయిందని పేర్కొన్నారు. వెంటనే చెత్తాచెదారాన్ని తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం

మర్పల్లి: గ్రామాభివృద్ధే తమ లక్ష్యమని సర్పంచ్ జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పంచాయతీరాజ్ శాఖ బీటీరోడ్డు నుంచి శ్మశాన వరకు ఎమ్మెల్యే ఆనంద్ నిధులు రూ.3 లక్షలతో ఫార్మేషన్ రోడ్డు పనులను సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. మిషన్ భగీరథతో తాగునీటి కష్టాలు గట్టెక్కాయని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీజేసీలో సీఈసీ గ్రూపు

కొడంగల్ రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల(జీజేసీ)లో నూతనంగా సీఈసీ గ్రూపు తెలుగు/ఇంగ్లిష్ మీడియంలో ప్రారంభించామని ప్రిన్స్‌పల్ ఎస్.శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఈసీ గ్రూపులో చేరే విద్యార్థులు 16వ తేదీ వరకు పని దినాలలో కళాశాల కార్యాలయంలో అడ్మిషన్ పొందాలని సూచించారు. ఇప్పటి వరకు కాలేజీలో హెచ్ఈసీ తెలుగు/ఉర్దూ మీడియం, ఎంపీసీ తెలుగు/ఇంగ్లిష్ మీడియం, బైపీసీ తెలుగు/ఇంగ్లిష్, సీఈసీ తెలుగు/ఇంగ్లిష్ మీడియం సబ్జెక్టులు అందుబాటులో ఉన్నాయని ఆయన వెల్లడించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని సూచించారు.

రెండు రోజుల్లో ఎలా సాధ్యం?



తాండూరు ఎంపీడీఓ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న జీపీ కార్యదర్శి రాములు



మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మీసేవ కేంద్రం వద్ద అర్జీ దారుల సందడి

- గృహలక్ష్మి పథకంపై ప్రజల్లో ఆందోళన
- మీసేవా కేంద్రాలకు పెరుగుతున్న రద్దీ
- తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు నిల్

తాండూరు రూరల్/ మోమిన్‌పేట: నిరు పేదల సొంతింటి కల.. కలగానే మిగలనుందా అంటే అవుననే సమాధానం వస్తోంది!. ప్రభుత్వం ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గృహలక్ష్మి దరఖాస్తులు అందజేయాలని పేర్కొంటూ.. కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఇచ్చింది. విషయం తెలుసుకున్న తాండూరు, మోమిన్‌పేట మండల పరిధి గ్రామాల ప్రజలు ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. కులం, ఆదాయం సర్టిఫికెట్ తప్పనిసరి కావడంతో.. వాటి కోసం మీసేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. 48గంటల గడువు ఇస్తే ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు.

అందుబాటులో లేని అధికారులు

తాండూరు తహసీల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు అందుబాటులో లేరు. తహసీల్దార్ తారాసింగ్ ఎన్నికల శిక్షణకు వెళ్లారు. ఓఆర్ఐ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీలో 20 రోజుల పాటు ప్రత్యేక విధులు నిర్వహించేందుకు వెళ్లారు. మరో ఆర్ఐ సెలవుల్లో ఉన్నారు. నిరంతరం కార్యాలయంలో అందుబాటులో ఉండే ఆర్ఐ.. పని ఒత్తిడి పెరిగి జ్వరంతో బాధపడుతున్నట్లు సమాచారం. దీంతో ధ్రువ పత్రాల ఇచ్చేందుకు ఎవరూ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయమై అందుబాటులో ఉన్న డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ్‌ను వివరణ కోరగా.. ఆర్ఐ రాజిరెడ్డి బుధవారం వస్తారని, ఆయన రాగానే సర్టిఫికెట్లు ఇచ్చేస్తామని తెలిపారు. నా వద్దకు ఎవరైనా వస్తే వారికి ధ్రువ పత్రాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. రెండు రోజుల్లో సర్టిఫికెట్లు రావు.. మూడు లక్షలు ఇవ్వరంటూ పలువురు ఎద్దేవా చేస్తున్నారు.

గడువు పెంచాలి

సొంత స్థలం ఉండి, ఇల్లు నిర్మించుకునేందుకు రూ.3లక్షలు గృహలక్ష్మి పథకం కింద ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అందుకు మూడు రోజులే గడువు ఇచ్చింది. అందులో మంగళవారం గడువు ముగిసింది. ఇక మిగిలింది బుధ, గురువారమే. ఈ రెండు రోజుల్లో మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సర్కార్ సూచించింది. అందుకు కులం, ఆదాయ, బ్యాంకు, ఆధార్, రేషన్ కార్డుల జిరాక్సులను దరఖాస్తుకు జతచేయాలని పేర్కొంది. ఈ 48 గంటల్లో పత్రాలు ఎలా సాధ్యమని అర్జీ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో పది రోజులు గడువు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.



మోమిన్‌పేట: మండల పరిషత్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న సూపరింటెండెంట్ బక్కప్ప

ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధి

- ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీరోడ్లు
- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో సర్పంచులు

యాలాల: గ్రామాభివృద్ధే లక్ష్యంగా, ప్రజల సహకారంతో ముందుకు సాగుతున్నామని ఎంపీటీసీ దేవగారి రాములు, ముద్దాయిపేట సర్పంచ్ కృష్ణయ్య గౌడ్ అన్నారు. మంగళవారం గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పనులను వారు ప్రారంభించి మాట్లాడారు. ఇటీవలే సైడ్ డ్రైన్ నిర్మాణం పూర్తి చేశామని, త్వరలో సీసీ నిర్మాణ పనులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పంతుల రాజప్ప, గొల్ల సురేష్, రవి కుమార్, వెంకటయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో..

పెద్దేముల్: తాండూరు ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని సర్పంచ్ భాగ్యలక్ష్మి అన్నారు. పెద్దేముల్ మండలం నాగులపల్లిలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.50 లక్షతో గ్రామంలో సీసీరోడ్డు పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలోని జుట్టు రవి ఇంటి నుంచి పాత వాటర్ ట్యాంక్ వరకు, గుల్ల లక్ష్మయ్య ఇంటి నుంచి శివానందరెడ్డి ఇంటి వరకు సీసీరోడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మట్ట శ్రీనివాస్, నాగరాజు, బసంత్ రెడ్డి, బసప్ప, బిచ్చిరెడ్డి, శివానంద్‌రెడ్డి, రాములు, మల్లప్ప, వెంకటేశ్, అంజప్ప, అంజయ్య, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.



పెద్దేముల్: సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ తదితరులు

చట్టబద్ధత కల్పించడం హర్షణీయం

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

యాలాల: ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లకు ప్రభుత్వం చట్టబద్ధత తీసుకురావడం శుభపరిణామమని పీఆర్‌టీయూ టీఎస్ యాలాల మండల అధ్యక్షుడు ఇందోలు శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడారు. పీఆర్‌సీ కమిషన్, మధ్యంతర భృతి ప్రకటిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. 2003 సీపీఎస్ ఉపాధ్యాయులకు ఓపీఎస్, ఈహెచ్ఎస్ కార్డు త్వరలో సాధిస్తామని చెప్పారు. పీఈటీ, పండిట్ పోస్టులు అప్‌గ్రేడ్, బదిలీల సమస్యలు సైతం సంఘం ఆధ్వర్యంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పెండింగ్ బిల్స్ ఆగస్టు లోపు క్లియర్ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, నెరవేర్చని పక్షంలో ధర్నాకు వెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి యాదయ్యగౌడ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మొగులప్ప, వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధాకర్, దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, మండల అసోసియేట్ అధ్యక్షుడు వెంకటయ్య, పరమేష్ తదితరులు ఉన్నారు.

హామీలు ఇవ్వడం.. మర్చిపోవడం

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అలవాటే
మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్



పార్టీలో చేరిన వారితో మాజీ మంత్రి

మోమిన్‌పేట: ఇటీవల కురిసిన వడగళ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఐదు నెలలు గడిచినా నయాపైస ఇవ్వలేదని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. మంగళవారం మోమిన్‌పేట మండలం వెల్‌చాల్ గ్రామంలో జరిగిన పార్టీ సమావేశంలో వివిధ పార్టీల నుంచి 20మంది కార్యకర్తలు ప్రసాద్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు హామీలు ఇవ్వడం.. మర్చిపోవడం ముఖ్యమంత్రికి అలవాటుగా మారిందని విమర్శించారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..

సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి, ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని మాజీ మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని, బీఆర్ఎస్‌పై వ్యతిరేకత పెరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు శుభాష్‌గౌడ్, మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య, మాణయ్య ఉన్నారు.

ప్రజాసమస్యలపై ప్రత్యేక శ్రద్ధ

- మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలి
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి



పరిగి: మురుగు జలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధికారులు, మున్సిపల్ చైర్మన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి సూచించారు. మంగళవారం నిర్వహించిన బస్తీబాటలో భాగంగా ఆయన తొమ్మిదో వార్డులో పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా కాలనీలో సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి, మురుగు జలాలు బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు మున్సిపల్ కార్మికులతో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించడంతో పాటు దోమలు వృద్ధి చెందకుండా వీధుల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించాలని చెప్పారు.

వర్షపు నీరు నిల్వకుండా..

వర్షాలకు గుంతల్లో నీరునిల్వ ఉంటుందని, అటువంటి పరిస్థితులను గుర్తించి నీరు నిలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి వెల్లడించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా అయ్యేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ ముదిరాజ్, ఎంపీపీ అరవింద్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, వైస్ చైర్మన్ భాస్కర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, కౌన్సిలర్లు రవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

పరిగి: మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని ఉద్యోగులు, కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది కార్మికులు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నామని, వెంటనే తమను పర్మినెంట్ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. చాలా చాలని జీతాలతో కుటుంబాలను పోషించుకుంటున్నామని, ప్రభుత్వం వెంటనే స్పందించి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

చురుగ్గా పనిచేసి, పరిస్థితులు చక్కదిద్దండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పరిగి: వసతి గృహాలకు రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో కొత్త భవనాలను నిర్మించి అన్ని వసతులు కల్పిస్తుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. గతంలో కన్నా నాణ్యమైన భోజనంతో పాటు దుస్తులు, దుప్పట్లు, కాస్మొటిక్స్, స్కాలర్‌షిప్‌లు అందజేస్తుందని, విద్యార్థుల భవిష్యత్తు బాగుపడాలంటే అధికారులు చురుగ్గా పని చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్ రావు, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, జెడ్పీటీసీ హరిప్రియ, కుల్కచర్ల ఎంపీపీ సత్యమ్మ, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ఐదో తరగతి విద్యార్థులకు
త్వరలో అందజేత: ఎంఈఓ



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ

పరిగి: విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులకు విద్యార్థులకు సంబంధించిన రాత పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం నోట్‌బుక్స్‌ను పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. మండలానికి మొత్తం 27వేల నోట్‌బుక్స్ వచ్చాయని వెల్లడించారు. ఐదో తరగతి విద్యార్థులకు వర్క్‌బుక్స్ వచ్చాయని, త్వరలో వాటిని పంపిణీ చేస్తామని చెప్పారు.

బాధ్యతాయుతంగా మెలగాలి



మర్పల్లి: ఎస్ఐ అభ్యర్థి రాజేందర్‌రెడ్డితో ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు



పెద్దేముల్: అశోక్‌ను సన్మానిస్తున్న మంబాపూర్ సర్పంచ్

- శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలి
- సమాజానికి పేరుప్రఖ్యాతులు తేవాలి: పల్లె ప్రజల ఆకాంక్ష
- ఎస్ఐ అభ్యర్థులను సత్కరించిన గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు

దోమ: ఎస్ఐ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు తమ బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ.. కన్నవారికి, ఉన్న ఊరికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ లక్ష్మయ్య ముదిరాజ్‌తో కలిసి ఎస్ఐ ఉద్యోగాలకు అర్హత సాధించిన చాకలి రాఘవేందర్, ఈరారం శ్రీనివాసులుకు అభినందనలు తెలిపి, శాలువాతో సత్కరించి మట్లాడారు. పోలీసు కొలువు అనేది గర్వంగా చెప్పుకునేది అని, అలాంటి ఉద్యోగంలో చేరి శాంతిభద్రతలను కాపాడేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు ఖాజపాష, మాజీ ఎంపీపీ రాజగోపాల చారీ, ఉప సర్పంచ్ గోపాల్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వార్డు సభ్యులు నిరోష, వసంతరావు, లక్ష్మణ్, రమేశ్, అంజిలమ్మ, విశ్రాంత ఉద్యోగి పంచలింగం, స్టేట్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరింత ఎత్తుకు..

యాలాల: ఎస్ఐగా అర్హత సాధించిన లింగమంతుల రాజును జీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ శివకుమార్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మెట్లి ఆశన్న, నాయకులు మంత్రి వెంకటయ్య రాజును ఘనంగా సన్మానించి మాట్లాడారు. గతంలో ఆర్మీలో పనిచేసిన రాజు, ఎస్ఐ పోస్టుకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కృష్ణ, శ్రీనివాస్, మోహన్ నాయక్, చిరంజీవి, మహమూద్, మహేందర్, అశోక్, నర్సింహులు, అంజిలయ్య, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

కానిస్టేబుల్‌గా పనిచేస్తూ..

బషీరాబాద్: కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఎస్ఐగా అర్హత సాధించిన రాథోడ్ మంజులకు సర్వత్రా ప్రశంసలు అందుతున్నాయి. బషీరాబాద్ మండలం జీవన్గీ గ్రామానికి చెందిన సోనిబాయి, లక్ష్మణ్ నాయక్ కూతురు మంజుల.. శంషాబాద్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఎస్ఐ పరీక్షల్లో ప్రతిభ చూపి ఎస్ఐగా ఎంపికైంది. దీంతో ఎంపీపీ కరుణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శాంతిబాయి, సొసైటీ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు రామునాయక్ మంజులను సన్మానించారు.



బషీరాబాద్: మంజులను సన్మానిస్తున్న ఎంపీపీ



దోమ: ఎస్ఐ అభ్యర్థులను సన్మానిస్తున్న రాజిరెడ్డి



యాలాల: రాజును సన్మానిస్తున్న గ్రామస్తులు

యువత ఆదర్శంగా తీసుకోవాలి



ఎస్ఐ అభ్యర్థులను సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంత యువత ఎస్ఐ అభ్యర్థులను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు సూచించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎస్ఐ ఉద్యోగానికి అర్హత సాధించిన అభ్యర్థులు జోగు యాదయ్య, ఇప్పాయిపల్లికి చెందిన జ్ఞానేశ్వర్, బొమ్మిరెడ్డిపల్లికి చెందిన చంద్రకాంత్, బొమ్మిరెడ్డిపల్లికి చెందిన రాఘవేందర్ (జీపీ కార్యదర్శి)ని అభినందిస్తూ శాలువ, పూల మాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్యగౌడ్, మాజీ సర్పంచ్ జానకీరాం, మాజీ సర్పంచ్ జోక్ వెంకటయ్య, దళిత మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, మండల ప్రధానకార్యదర్శి హన్మంతు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు వెంకటేష్, వార్డు సభ్యులు మహిపాల్, నరేశ్, సంతోష్, శివ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తుల హర్షం



మహేశ్

కొడంగల్ రూరల్: రావులపల్లి గ్రామానికి చెందిన జి.మహేశ్ ఎస్ఐ అభ్యర్థిగా ఎంపిక వడంతో గ్రామస్తులు, స్నేహితులు హర్షం వ్యక్తంచేశారు. నాలుగేళ్లుగా నగరంలో ఉంటూ ఉద్యోగం సాధించాలనే లక్ష్యం, పట్టుదలతో ఎస్ఐ కొలువు సాధించాడని పేర్కొన్నారు.

జహీర్ అలీఖాన్‌కు నివాళి

బొంరాస్‌పేట: ప్రముఖ ఉర్దూ పత్రిక సియాసత్ సంపాదకుడు జహీర్ అలీఖాన్ మృతిచెందడం ఉర్దూ ప్రతికా రంగానికి తీరని లోటని తెలంగాణ విద్యావంతుల వేదిక, టీజేఏసీ నాయకులు అన్నారు. గద్దర్ భౌతిక కాయాన్ని చూసేందుకు వెళ్లిన ఆయన.. తొక్కిసలాటలో గుండెపోటుకు గురై మృతి చెందడం బాధాకరం అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కీలక పాత్ర పోషించి రాష్ట్ర ప్రజలకు, విద్యావంతులకు, మేధావులకు స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో టీవీవీ, టీజేఏసీ నాయకులు రవీందర్‌గౌడ్, గౌరారం గోపాల్, బాకారం యంద్రశేఖర్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం

మర్పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొనే విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించే విధంగా సీఆర్‌పీలు పర్యవేక్షించాలని మండల విద్యాధికారి విద్యాసాగర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం సరఫరా చేసిన రాగిజావ, పౌష్టికాహారం, బెల్లం ప్యాకెట్లను ఆయా క్లస్టర్ల సీఆర్‌పీలకు ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి పాఠశాలలో నిర్వాహకులు మెనూ పాటించాలని చెప్పారు. మెనూ పాటించని నిర్వాహకులు, పర్యవేక్షించని హెచ్‌ఎంలపై చర్యలు ఉంటాయని ఎంఈఓ హెచ్చరించారు.

చదువుంటేనే జీవితం

దోమ: నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతామని ప్రథం సంస్థ సెకండ్ చాన్స్ పోగ్రాం టీం లీడర్ ఆంజనేయులు తెలిపారు. మంగళవారం సంస్థ ఆధ్వర్యంలో సెకండ్ ఛాన్స్ పోగ్రాంలో భాగంగా మల్లేపల్లిలో మధ్యలో చదువు మానేసి నిరక్షరాస్యులైన 23 మందిని గుర్తించి, వారిని ఓపెన్ టెన్త్ విభాగంలో చదువుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడారు. ప్రస్తుత కాలంలో చదువు ఉంటేనే జీవితం ముందుకు సాగుతుందని, అలాంటి చదువును.. చదువు రానివారికి అందేలా శ్రద్ధ చూపుతున్నామని పేర్కొన్నారు. అవసరమైన వారు సంస్థను సంప్రదించాలని కోరారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, అంగన్‌వాడీ టీచర్ బసమ్మ, సంస్థ మండల కోఆర్డినేటర్ మురళీ కృష్ణ, విద్యార్థులు, నిరక్షరాస్యులు పాల్గొన్నారు.